# హిందూ మతానంతర భారతదేశం

## సామాజిక, ఆధ్యాత్మిక, శాస్త్రీయ రంగాల్లో దళిత బహుజన విప్లవం

కంచ ఐలయ్య

తెలుగు సేత

ప్రభాకర్ మందార

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | కృతజ్ఞతలు | 12 |
| | ఉపోద్ఘాతం | 13 |
| 1. | ఉచిత ఉపాధ్యాయులు | 36 |
| 2. | బడుగువర్గ శాస్త్రజ్ఞులు | 65 |
| 3. | ఉత్పత్తి సైనికులు | 95 |
| 4. | బడుగువర్గ స్త్రీవాదులు | 116 |
| 5. | సామాజిక వైద్యులు | 138 |
| 6. | మాంసం పాల ఆర్థికవేత్తలు | 156 |
| 7. | అజ్ఞాత ఇంజనీర్లు | 185 |
| 8. | ఆహార ఉత్పత్తి దార్లు | 203 |
| 9. | సామాజిక స్మగ్లర్లు | 225 |
| 10. | ఆధ్యాత్మిక నియంతలు | 248 |
| 11. | ఇంటలెక్చువల్ గూండాలు | 287 |
| 12. | అంతర్యుద్ధ చిహ్నాలూ–హిందుమత అంతం | 313 |
| 13. | ముగింపు: హిందూ మతానంతర భారతదేశం | 356 |

అధ్యాయం 1

# ఉచిత ఉపాధ్యాయులు

## తొలి అడుగు

**భా**రతదేశంలోని అనేక పొరలతో కూడిన సమాజాన్ని ఎవరైనా పరిశీలించడం మొదలుపెడితే అది వారిని దుర్భర వేదనకు గురిచేస్తుంది. భారత సామాజిక, సాంస్కృతిక, నాగరిక వ్యవస్థల చిక్కుముడులను విప్పేందుకు గతంలో ఎందరో విదేశీ మేధావులూ, స్వదేశీ బ్రాహ్మణ పండితులూ ప్రయత్నించారు. కానీ వారంతా చివరకు భారతీయ సారాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. భారతీయ సమాజాన్ని అధ్యయనం చేయాలంటే దాని ప్రక్రియలతో మమేకం కావాల్సి వుంటుంది. అనేక అణిచివేత రూపాలనూ, ఆధిపత్య సంబంధాలనూ నిర్మించిన వివిధ కులాల తీరును కూడా పరిశీలించాల్సి వుంటుంది. ఆధిపత్య కులాల విద్యావేత్తలు ఉత్పత్తి కులాల విశిష్ట జీవన శైలిని అర్థం చేసుకోలేక పోయారు. శాస్త్ర, సాంకేతిక తదితర రంగాలకు ఆదివాసీ సమాజాలు చేసిన చారిత్రక సేవలను కూడా వారు గుర్తించ లేకపోయారు. ఆధునిక జాతీయ పదావళిని రూపొందించాలంటే శతాబ్దాలుగా అణిచివేతకు గురైన వర్గాల అంతర్గత శక్తినీ, మనసునూ అర్థం చేసుకోవాల్సి వుంటుంది.

భారతదేశంలోని వివిధ కులాల, సమాజాల జీవన విధానాన్ని పరిశీలించేందుకు నేను ప్రయత్నిస్తాను. అతి సంక్లిష్టమైన కుల వ్యవస్థలతో కూడిన సమాజాన్ని అధ్యయనం చేసేటప్పుడు ఆ సమాజపు విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడం కొంత కష్టంగానే అనిపిస్తుంది. అయినప్పటికీ ఆ దిశలో కృషి చేయక తప్పదు. బ్రాహ్మణీయ సమాజ సంకెళ్ల నుంచీ, తమ అజ్ఞానం నుంచీ దళితబహుజనులను విముక్తి చేసేందుకు ఈ కృషి ఎంతగానో తోడ్పడుతుంది.

గత కొద్ది సంవత్సరాల్లో నేను కొన్ని ప్రశ్నలను విశ్లేషించాను. మనకు ఎలా జీవించాలో ఎవరు నేర్పారు? మనలోని మానవతను ఎవరు నిర్మించారు? మన ఇంద్రియ జ్ఞానానికి పదును పెట్టిందెవరు? మనకు ఎన్నో విలువైన పాఠాలను బోధిస్తున్న దెవరు?

భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో నేను స్వయంగా పయనించి కనుగొన్న సమాధానం మీకు అసాధారణంగా, అనూహ్యంగా అనిపించవచ్చు. అది: 'ఆదివాసులు'. ఆ పేరు చెప్పగానే పట్టణ ప్రాంత, గ్రామీణ ప్రాంత ప్రజలందరిలో అజ్ఞానులు, ఆదిమ మానవులు, అనాగరికులు అనే భావనలు మెదులుతాయి. మన ఆధ్యాత్మిక, లౌకిక, జ్ఞాన గ్రంథరాజాలన్నీ వారిని 'వనవాసీలు'గా (అడవి మనుషులుగా), 'గిరిజనులు'గా (కొండ జనంగా) చిత్రించాయి. వారు మైదాన ప్రాంత వాసుల నాగరికతా ప్రమాణాలను అలవాటు చేసుకోలేకపోయారనే భావనను కలిగించాయి. వారి జీవితాలు భారత సమాజం ఈ కొసన వున్న బ్రాహ్మణుల జీవితాలంత విలువైనవని ఎవరూ అనుకోరు. భారతదేశంలోని జీవిత విలువ ఇటు ఆదివాసీలకూ, అటు బ్రాహ్మణులకూ మధ్య ఊగిసలాడుతూ వుంటుంది. ఈ రెండు వర్గాలూ భారత సమాజంలో రెండు భిన్న ధృవాలుగా రూపొందాయి. తత్ఫలితంగా ఆదివాసీలు పుట్టెడు మానవ కష్టాలతో పాటు, పౌర సమాజంలో భాగస్థులు కాకపోవడం వల్ల కలిగే అదనపు సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారు. అనుకోని ప్రకృతిపర సమస్యతోపాటు, సామాజిక సహకారం లేకపోవడం వల్ల కలిగే అనేక ఇబ్బందులూ, ఇతర కులాల క్రూరత్వం మొదలైన వాటిని కూడా వారు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు బ్రాహ్మణులు ఇతర్లపై "హింసా సంస్కృతి"ని రుద్ది మరీ తాము మూఢనమ్మకాల జీవితాన్ని అనుభవిస్తున్నారు.

అనేక ఆధునిక సిద్ధాంతాల నేపథ్యంలో బ్రాహ్మణీయ సమాజాల నిర్మాణాన్ని పరిశీలించినప్పుడు అది ఆదివాసీల సామాజిక వ్యవస్థల కంటే, వారి ఆలోచనా విధానాల కంటే; గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో నివసించేవారి సామాజిక వ్యవస్థలూ, ఆలోచనా విధానాలే ఎంతో ఎక్కువ మానవీయమైనవని భావిస్తున్నట్టు అర్థమవుతుంది. ఒక్క దళితులకు తప్ప భారతదేశంలోని అత్యధిక జనానికి ఇలాంటి అభిప్రాయమే వుంది. అయితే ఆదివాసీ సమాజపు హృదయాన్ని నిశితంగా పరిశీలించిన నాకు ఆదివాసీల స్వభావం గురించీ, వారి వ్యక్తిత్వం గురించీ ఒక విభిన్న వాస్తవం తెలిసింది. దానిని విద్యావంతులైన భారతీయు లెవరూ ఇంతవరకూ అర్థం చేసుకోలేకపోయారు లేదా కనీసం గుర్తించలేకపోయారు. ఇన్నాళ్లుగా ఆధిపత్య అధికారాన్ని అనుభవిస్తూ వస్తున్న అగ్రకులాలవారు ఈ వాస్తవాన్ని గుర్తించినప్పుడు వారి ఉనికికే ఎసరొస్తుంది.

ప్రతీ సంస్కృతికీ లేదా ప్రతీ నాగరికతకూ ఆయా నిర్దిష్ట సందర్భాల్లో తొలిఅడుగులూ, ఎదుగుదలలూ వుంటాయి. అగ్రకులాల – ప్రత్యేకించి బ్రాహ్మణీయ కులాల సాంస్కృతిక హక్కులు మానవాళి ప్రతికూల అనుభవాల నుంచి రూపుదిద్దుకున్నాయి. అవన్నీ కూడా ఉత్పత్తి విధానాలకు దూరంగా వుండే మనుషుల పరస్పర చర్యల మీద ఆధారపడినవే.

మానవ సమాజాల మూల సంస్కృతులనూ, నాగరికతలనూ ఆధిపత్య కులాలు వెనక్కి నెట్టాయి. బ్రాహ్మణీయ సంస్కృతుల నిర్దాక్షిణ్య ఆధిపత్య విధానాలు – ఇతర కులాల సంస్కృతినీ, నాగరికతా మూలాలనీ సర్వనాశనం చేశాయి. బ్రాహ్మణీయ సంస్కృతీ, నాగరికతలే అన్నింటికంటే గొప్పవైనట్టు భ్రమించేలా చేశాయి. చివరకు బ్రాహ్మణీయ ఉత్పత్తి వ్యతిరేక సంస్కృతిని ఉత్పత్తి వర్గాలు సైతం ఆమోదించేట్టు చేశాయి. అంతేకాదు వారిదే సర్వోత్కృష్టమైన సంస్కృతనీ, అదే ఏకైక చారిత్రక వాస్తవమనీ నమ్మేట్టు చేశాయి. బ్రాహ్మణీయ సంస్కృతి ఈవిధంగా విస్తృతమవడం వల్ల మానవ సృజనాత్మకతా మూలాలు చాలావరకు వెలుగులోకి రాకుండా, అజ్ఞాతంగా వుండిపోయాయి. ఇదంతా ఉద్దేశ పూర్వకంగానే జరిగింది. అయితే ఆదివాసీ సంస్కృతిని జాగ్రత్తగా గమనిస్తే మానవ సృజనాత్మకత తాలూకు తొలినాళ్ల చిహ్నాలనూ, జాడలనూ అది ఇప్పటికీ తనలో పదిలపరచుకుని వున్నట్టు స్పష్టమవుతుంది.

## పేర్లూ, సంస్కృతీ

అన్ని సంస్కృతులూ వాటికి సంబంధించిన సమాజాల, వ్యక్తుల పేర్ల మీద భాషాపరంగా రూపొందించ బడ్డవే. సంస్కృతీ నియమాలు కూడా ఆహారపు అలవాట్లపైనా, దుస్తులపైనా ఆధారపడి ఏర్పడ్డాయి. ఈ అంశాలన్నింటిలోనూ ఆదివాసీలు ఆదిమ మానవ జ్ఞాన పద్ధతులనే అనుసరిస్తారు. మన జ్ఞాన వ్యవస్థలకు అదే ప్రాతిపదికతను సమకూర్చింది. ఆదివాసీలందరికీ గోండ్లు, కోయలు, కొండరెడ్లు, చెంచులు, నాయకపోళ్లు, లంబాడాలు వంటి సొంత సామాజిక పేర్లుంటాయి. వాళ్లలో ఎవరూ గిరిజనులుగా లేదా వనవాసీలుగా గుర్తించబడాలని కోరుకోరు. ఆ పేర్లు తమకు ప్రతిబంధకంగా మారతాయని వారు భావిస్తారు. అందుకే తమను గోండులు, కోయలు, లంబాడాలు వంటి నిర్దిష్టమైన పేర్లతోనే సంబోధించాలని కోరుకుంటారు. వాళ్లని వనవాసీలుగా అభివర్ణించడమనేది మాల, మాదిగలను (దళితులను) "హరిజనులు"గా సంబోధించడం లాంటిదే. ఆ పిలుపు వారికి చిరాకును కలిగిస్తుంది. ఆ ప్రతికూల ముద్రకు వ్యతిరేకంగా తిరగబడటం వారిలోని రాజకీయ, జాతీయవాద ఆకాంక్షకు సంకేతం. ఈ వర్గాలవారు నేడు హిందూ కుల ఆధిపత్యాన్ని ఎదిరిస్తున్నారు. భాష, మతం, సంస్కృతులకు సంబంధించిన పదావళిలో చోటు సంపాదించుకుని తమదైన సాంస్కృతిక గుర్తింపును పొందాలని కోరుకుంటున్నారు. బ్రాహ్మణీయ రచయితలు తమ సంస్కృతీ వైభవాన్నీ, గొప్పదనాన్నీ చాటుకునేందుకు లెక్కలేనన్ని పుస్తకాలు రాసుకున్నారు. అయితే కొందర్ని వనవాసీలనీ లేదా గిరిజనులనీ పిలవడం ఎంత అవమానకరంగా వుంటుందో వారు గ్రహించాలి. ఈ వైనాన్ని ఒక